మహిళ ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

చక్రాయపేట : మండలంలోని అద్దాలమర్రిలో ఆత్మహత్య చేసుకున్న గంగా సుమతి కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఆర్కేవ్యాలీ సీఐ నాగరాజు తెలిపారు. ఆరు నెలల క్రితం గంగా సుమతికి కదిరికి చెందిన ప్రశాంత్‌తో వివాహం జరిగిందన్నారు. అప్పటి నుంచి భర్త ప్రశాంత్, అత్త లక్ష్మీదేవిలు ఆమెను వేధిస్తుండటంతో అద్దాలమర్రిలోని పుట్టింటికి వచ్చి ఈనెల 7న ఆత్మహత్య చేసుకుందన్నారు. అప్పట్లో మృతురాలు సోదరుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం తలుపుల వద్ద నిందితులను అరెస్టు చేసి లక్కిరెడ్డిపల్లె మెజిస్ట్రేటు కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జయహో జగన్మాత

పులివెందుల టౌన్ : పట్టణంలోని అమ్మవారి ఆలయాలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు గజలక్ష్మీ దేవిగా, అంకాలమ్మ ఆలయంలో ధనలక్ష్మీగా, బ్రాహ్మణపల్లె గ్రామంలోని గంగమ్మ ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు.

కమలాపురం : పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ అమ్మవారు శ్రీ కనక మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు.

వీరపునాయునిపల్లె : తలపనూరు గంగమ్మతల్లి, గడ్డంవారిపల్లె రాజరాజేశ్వరీదేవి, కీర్తిపల్లె నల్లనమ్మ తల్లి, అనిమెల బోగాదమ్మ మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమివ్వగా, సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి సిద్ధిధాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సింహాద్రిపురం : స్థానిక పాతూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వేముల : మండలంలోని గొల్లల గూడూరు గ్రామంలోని శ్రీనల్లనమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ముద్దనూరు : స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో రాత్రి శ్రీగజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

జమ్మలమడుగు : భావసార క్షత్రియుల కులదైవమైన అంబభవాని భక్తులకు విశ్వరూప దర్శనంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా వేటకుక్కలు(భడుభుక్కల)వేషంలో అమ్మవారిని పూజించే భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని భద్రావతి భావనారుషి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి బిందె సేవ, కలశ పూజ నిర్వహించారు.

వల్లూరు : వల్లూరులోని శ్రీవాసవీ ఆర్య వైశ్య కళ్యాణ భవనంలో అమ్మవారు మీనాక్షీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

ముద్దనూరు : స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శ్రీగజలక్ష్మీదేవిగా అలంకరించారు.

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం పడమటి వీధిలో చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారికి మహాలక్ష్మీదేవి అలంకరణ చేశారు.



పులివెందులలో గజలక్ష్మీదేవిగా వాసవీకన్యకాపరమేశ్వరి

వైభవంగా శ్రీవెంకటేశ్వరస్వామి రథోత్సవం

సింహాద్రిపురం : స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక రథంపై ఉంచారు. ఈ రథోత్సవం సింహాద్రిపురంలోని అంగళ్ల బజార్, బైపాస్ రోడ్డు వెంబడి డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య వైభవంగా నిర్వహించారు. కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం

వల్లూరు (చెన్నూరు) : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చక పోవడం దారుణమని చెన్నూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నూరు మండలం వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో చంద్ర ఓబుల్‌రెడ్డి, పాలగిరి ఉమామహేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో డాక్టర్ రామ్‌కుమార్ బీపీ, ఇసీజీ, 2డీ ఏకో, 2డీ స్కానింగ్ తదితర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

పులివెందుల రూరల్ : ఎంపీ కుమారుడు వైఎస్ విక్రాంత్‌రెడ్డి 12వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనంలో కేక్ కట్ చేసి దివ్యాంగులకు అందించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప ఎంపీ అభిమానులు సమకూర్చిన దుస్తులను 30 మంది దివ్యాంగులకు వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి రమణారెడ్డి, హరి, కౌన్సిలర్ కోడి రమణ, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ షమీవుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప